



5

# ఆమె ఇల్లు

కవనశర్మ

పెద్దగా చదువుకోని కమలకు చిన్న ఉద్యోగం దొరికింది. ఉద్యోగం సమస్యతీరిన కొద్దిరోజులకే ఆమె ఉండటానికి ఇల్లు వెతుక్కోడానికి నిర్ణయించుకుంది.

ఉద్యోగాలకి దరఖాస్తులు పెడ్తుంటే, "నీకీ వయస్సులో ఉద్యోగం ఎందుకంట?" అని అడిగాడు భర్త రామారావు.

"సుఖంగా ఉండాల్సిన వయస్సులో ఎందుకమ్మా ఈ అర్థంలేని పనులు," అని నొచ్చుకుంటూ అడిగాడు కొడుకు నారాయణ.

"అక్కయ్యా! ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మ నీకెందుకు! వచ్చి నాతో ఉండు, నీకేదైనా మనస్సు నొప్పి కలిగితే!" అని ఉత్తరం రాశాడు తమ్ముడు కృష్ణ.

అప్పుడు కమల అందరికి ఒకటే సమాధానం చెప్పింది. "నాకు తోచడం లేదు. ఎప్పుడు విసుగు వస్తే అప్పుడు మానేస్తాను," అని.

ఈవిడగారు అడిగింది కదా అని ఈ వయస్సులో ఈవిడకి ఉద్యోగం ఎవరిస్తారని అందరు ధీమాగా వుండి గట్టిగా అడ్డుపడలేదు. మనదేశంలో ఓ సౌభాగ్యం వుంది. పని చేయడానికి, ముఖ్యంగా కష్టపడి ఏ పనైనా చెయ్యడానికి సిద్ధపడేవారికి ఏదో ఒక ఉద్యోగం దొరకకపోదు. సాధారణంగా చూపు అన్నివైపులకి ప్రసరించని వారికే ఉద్యోగాలు దొరకడం కష్టం అవుతుంది. కమల తనదైన డబ్బు సంపాదించుకోవాలన్న గట్టి పట్టుదల ఏర్పర్చుకొన్నాక ఉద్యోగం పెద్ద కష్టం లేకుండానే దొరికింది.

ఉద్యోగం దొరికిన కొన్నాళ్లకి తనకంటూ తనదైన ఒక ఇల్లు ఎంత చిన్నదైనా సరే, ఇరుకుదైనా సరే అద్దెకు సంపాదించాలనుకుంది. ఇల్లు చూడమని తెలిసిన వాళ్లని అడిగితే సహాయం చెయ్యకపోగా నోట్లో గడ్డి పెడ్తారని తెలుసు కనుక తనే ప్రయత్నాలు మొదలు పెట్టింది.

కాని ఇల్లు దొరకటం ఉద్యోగం దొరకటమంత సులభంగా లేదు.

"మీరెంతమంది వుంటారు?"

"నేనొక్కతినే!"

"మీవారు, పిల్లలు ఈ ఊళ్లో ఉండరా?"

"మావారుంటారు. పిల్లలు పెళ్లిళ్లయి దూరంగా ఉన్నారు".

"మీవారు మిమ్మల్ని విడిచిపెట్టారా? లేక విడాకులిచ్చారా?"

"లేదు."

"మీవారేం చేస్తూ ఉంటారు?"

కమల చెప్పింది.

"అంత పెద్ద ఉద్యోగస్తుడి భార్య అయిన మీరు ఇంత చిన్న ఇంట్లో ఉండగలరా!"

"అనే అనుకుంటున్నాను."

"మీవారు వస్తూ పోతూ ఉంటారా?"

"తెలియదు," అని చెప్పింది కమల ఆలోచించి.

"మీ ఇద్దరు దెబ్బలాడుకున్నారా?"

"లేదు."

"మీకు స్వంత ఇల్లుందా?"

"లేదు."

"మీరో అద్దె ఇంట్లోను, మీ ఆయనో అద్దె ఇంట్లోను ఉంటారా?"

"కాదు. నేను అద్దె ఇంట్లోను, ఆయన తన స్వంత ఇంట్లోను ఉంటాము."

"ఆయన స్వంత ఇల్లు మీదికాదా!?" ఇంటావిడలు ఆశ్చర్యంగా అడగసాగారు.

"కాదుట."

"ఎవరన్నారు?"

"ఆయనే పెళ్లయినప్పటి నుంచి అంటున్నారు. అద్దె ఇల్లయినా, స్వంత ఇల్లయినా... అది ఆయన్దేట. ఇంతకూ ఈ ఇల్లు మీదా? మీ ఆయనదా? ఈ ఇల్లు అద్దెకివ్వగలిగిన అధికారం మీకుందా?" కమల ప్రతి ఇంటావిడను అడిగింది. ఇంతకాలం వాళ్లు ఆ ఇళ్లు వాళ్లవేననుకుంటున్నారు కానీ ఆ ఇళ్లు అద్దెకివ్వగల అధికారం నిజంగా వాళ్లకి లేదు. వాళ్ల భర్తలకుంది.

ఈ ప్రశ్నలు వాళ్లనిబ్బంది పెడ్తే కమల ధోరణి వాళ్లని భయపెట్టింది. ఆమె మరీ బరితెగించిన ఆడ దేమో అన్న అనుమానం పట్టుకొంది. కమల వితంతు వైనా, భర్తచే పరిత్యజింపబడినదైనా కాస్త వాళ్లకి జాలి ఉండునేమో కానీ ఆమె రెండూకాదు. పండంటి కాపురం కాదనుకొని వచ్చిన స్త్రీ. చూడ్డానికి మంచిదాన్లా ఉన్నా, పెద్దదాన్లానే ఉన్నా తమ కాపురాలకి ప్రమాదం రావచ్చు నని స్త్రీలు అనుకొంటే, తమ ఇంటి ఆడవారి మీద ఆమె ప్రభావం పడ్తే పరిణామాలు ఎట్లా ఉంటాయోనని ఆ ఇళ్ల యజమానులు భయపడ్డారు. అందుకని వాళ్లె వరూ ఆమెకి ఇల్లు ఇవ్వలేదు.

ఆఖరికి కమల వయస్సే ఉన్న ఒక అవివాహిత స్త్రీ కమల ఆఫీసులోనే పనిచేస్తున్న ఆవిడ తన తండ్రి తనకి వదిలిపోయిన చిన్న ఇంట్లో చిన్నభాగం విడిగా ఏర్పాటుచేసి కమలకి అద్దెకిచ్చింది, కంపెనీ కోసం. ఆ మర్నాడు కమల ఆఫీసుకి సెలవుపెట్టి బాంకుకి వెళ్లింది.

బ్యాంకులో ఆమె పేర్న తండ్రి పోతూపోతూ వేసిన పదివేల రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో ఉన్నాయి. దానిమీద అయిదువేలు అప్పు తీసుకుని ఇంటికి కావ లసిన వస్తువులు ఒక మంచం, పరుపు, స్టౌ, పప్పులు, ఉప్పులు మొదలైనవి కొనిపెట్టుకుంది.

ఆపైన తన భర్త ఇంటికి వెళ్లింది. అప్పుడు భర్త ఇంట్లో ఉండడని ఆమెకి తెలుసు. తనతో కొని తెచ్చు కున్న పెట్లో తన బట్టలు నాలుగూ సర్దుకొంది.

"మీరు నన్ను ఏలుకోవడానికిగాను మా పుట్టింటి వారు మీకు పెట్టిన లంచాలు, మంచాలు, కంచాలు మీకే మీ ఇంట్లో వదిలిపెట్టి వెళ్తున్నాను. ఇన్నాళ్లు మీరు నన్ను పోషించారు. నేను చాకిరీ చేశాను. రెండింటికీ చెల్లు. ఇందులో నా అడ్రస్ ఇస్తున్నాను. ఆ ఇల్లు అద్దెది. కాని అది 'నా' అద్దె ఇల్లు. మీకెప్పుడైనా రావాలనిపిస్తే రండి. వచ్చినప్పుడు తినాలనిపిస్తే నా వంట తినండి. నా ఇంట పడుకోవాలనిపిస్తే పడుకోండి. ఇదే నా ఇంటికి మీకు నా ఆహ్వానం."

అని భర్తకో చీటీ రాసిపెట్టి, పెట్టె పుచ్చుకొని బయటకు వచ్చి ఇల్లు తాళం వేసి తాళంచెవి పక్కింట్లో ఇచ్చింది. ఆవిడ అడగనే అడిగింది.

"ఊరు వెళ్తున్నారా?" అని.

"లేదు నా ఇంటికి వెళ్తున్నాను," అని కమల చెప్పింది. ఆవిడ అయోమయంగా చూసింది. ఇవాళ కాకపోయినా రేపైనా అందరికీ తెలిసేదే కదా అని కమల తను వేరే ఇల్లు చూసుకొని వెళ్లిపోతున్నట్టు చెప్పింది ఆవిడతో. ఆవిడ నోరు తెరిచి వింది.

కమల భర్త ఇంటికి వచ్చి కమల పెట్టిన ఉత్తరం చూసుకున్నాడు. ముందర ఆ ఉత్తరం అర్థంకాలేదు. అర్థమయ్యాక కమల తెగువకి ఆశ్చర్యం, కోపం కలి గాయి. ఆ కోపంలో కమల చేసిన తెలివితక్కువ పని గురించి ఆమె తమ్ముడికి, తన సంతానానికి ఉత్తరాలు రాసి పడేశాడు.

ఉత్తరం అందగానే కమల తమ్ముడు కృష్ణ పరుగెత్తుకు వచ్చాడు. బావగారు చెప్పినది విన్నాడు. చిరునామా తీసుకున్నాడు. కమల ఇంటికి వెళ్లాడు. ఆ రోజు ఆదివారం అవటం వల్ల ఆమె ఇంట్లోనే ఉంది.

"రా రా," తమ్ముడి ఆపేక్షగా పిలిచింది. అతడ్ని ఉన్న ఒక్క కుర్చీలో కూర్చోబెట్టి తను మంచం మీద కూర్చుంది. తమ్ముడి కుటుంబం యోగక్షేమాలు అడిగింది. అక్క అడిగిన ప్రశ్నలకు ముక్తసరిగా సమా ధానాలు చెప్పి, అక్కతో-

"నువ్వు చేసిన పనేం బాగాలేదక్కా! బావగారు ముక్కోపే! అందరికీ తెలిసిన విషయమేగా! కోపంగా ఏదన్నా అన్నారనుకో ముప్ఫై యేళ్లు సర్దుకున్నదానివి. నీకు కొత్తేం కాదుకదా! అయినా బావకి దూరంగా కొన్నాళ్లుందాం అని నువ్వనుకొంటే వచ్చి నా దగ్గరుండ రాదా? లేక నీ కొడుకు దగ్గరకు వెళ్లరాదా? నువ్వొచ్చి ఉంటానంటే వద్దనే వాళ్లెవరు? ఆఖరికి బావగారు కూడా నువ్వు అల్లా చెప్పాపెట్టకుండా వచ్చేసినందుకు బాధపడ్తున్నారు కాని నువ్వు వెనక్కి వెళ్తే ఆదరించరా? వద్దంటారా? అది నీ ఇల్లు కాదా? అంతింటికి యజ మానురాలివి ఈ దోసెడు కొంపలో ఎలా ఇరికావు! ఎందుకు ఇరికావు!" అన్నాడు. ఆ మాటల్లో అక్క చేసిన మూర్ఖపు పనిపట్ల విసుగున్నా అక్కపట్ల అనురాగం వుంది. అక్క సుఖంగా ఉండాలనే ఆకాంక్ష ఉంది.

కమల తాపీగా జవాబు చెప్పింది.

"అది నా ఇల్లు కాదా అని అడిగావు. అది నా ఇల్లు కాదు. ఒకప్పుడు నాదే అనుకున్నాను. ఆ ఇల్లు, మా ఆయన పెంచుకొంటున్న కుక్కదెట్లా కాదో, నాదీ

అట్లానే కాదు. ఆయన కుక్కనీ ఆపేక్షగానే చూసుకొం టారు. నన్నూ ఆపేక్షగానే చూసుకొంటారు. అంత మాత్రాన ఆయనకులాగా మాకు ఇంటిమీద హక్కు లుండవు. మేము మా బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఆయన ఆపేక్షని ప్రతిఫలంగా పొందగలిగాము అంతే!"

"ఎందుకక్కా అంత నిష్ఠూరంగా మాట్లాడ్తావు! పోనీ ఏదో విషయంలో బావగారి వల్ల నీ మనస్సుకి నొప్పి కలిగింది. ఆనొప్పి తగ్గేవరకు వచ్చి నాతో ఉండు. మనసు కుదుటపడ్డాక వెళ్లిపోదూగాని" అన్నాడు తమ్ముడు.

"నేను ఆపేక్ష తక్కువై మీ బావగారి ఇల్లు విడిచి పెడ్తే ఆపేక్షగా చూసుకొనే పుట్టింటికి పరిగెత్తేదానిని. ఆపేక్షకి ఏమీ లోటులేదు నాకాయన దగ్గర. కాని అది నా యిల్లు కాదని విడిచిపెట్టాను. అట్లాగే నీ ఇల్లూ నాది కాదు కనక రాను," అంది.

"అది నాన్నగారు కట్టిన ఇల్లు. అందులో ఉండ టానికి నాకెంత హక్కుందో నీకూ అంతే ఉంది. వచ్చి ఉండు," అన్నాడు తమ్ముడు నిజాయితీగా.

"ఇది ఉండటానికి ఉండే హక్కులు గురించిన సమస్య కాదు. మీ బావగారు కూడా ఉండమంటు న్నారు కాని పొమ్మనడం లేదుకదా! అసలు విషయం ఏమిటంటే నా తండ్రి కట్టించిన ఇల్లూ నాదికాదు, మా మావగారు కట్టించిన ఇల్లూ నాది కాదు. ఆఖరికి నా భర్త కట్టిన ఇల్లూ నాది కాదు. ఈ విషయం మీరందరూ తలోవిధంగా నాకు తెలియజేశారు," అంది ఏ ఉద్రేకం చూపించకుండా. ఆమె ఎంతో మథనపడి తీసుకున్న నిర్ణయం తనింట్లో తను ఉండటం. "నేనందుకని మీ ఇళ్లల్లో ఉండను," అని పూర్తి చేసింది.

"నేనెలా తెలియజేశాను?" అని ఆశ్చర్యంగా అడిగాడు తమ్ముడు.

"ఎందుకులే అదంతా ఇప్పుడు."

"ఫరవాలేదు చెప్పు," అన్నాడు కృష్ణ.

"నీకు గుర్తుండి ఉంటుంది. నాకు పెళ్లయ్యేసరికి నాకు పద్దెనిమిదేళ్లు. నీకు పదిహేనేళ్లు. నాకు పెళ్లయ్యే వరకు పాత న్యూస్‌పేపర్లు అమ్మగా వచ్చిన డబ్బు మని ద్దరికీ అమ్మ చెరిసగం ఇచ్చేది. ప్రతి తల్లికీ తమ ఇంట్లో కూతురికి, కొడుక్కి సమమైన స్థానం కల్పించాలని ఉంటుంది కదా. అందుకే నా పెళ్లయిన వేసంకాలం నేను పుట్టింటికి వచ్చినప్పుడు అమ్మిన పాత న్యూస్ పేపర్ల డబ్బు అమ్మ చెరి సమానంగా ఇవ్వబోయింది. అప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా?" కమల కృష్ణ ముఖంలోకి చూస్తూ అడిగింది.

కృష్ణకి గుర్తు వచ్చింది. కమల పెళ్లయిన ఆరు నెలలకి పుట్టింటికి వచ్చింది. అప్పుడు వాళ్లింట్లో ఉన్న పాత న్యూస్‌పేపర్లు అమ్మటం జరిగింది. కృష్ణ తండ్రి పిల్లలకి పాకెట్‌మనీ ఇచ్చేవాడు కాదు. అందుకని పాత న్యూస్‌పేపర్లు, సీసాలు అమ్మితే వచ్చిన డబ్బుని తల్లి పిల్లలకి స్వంత ఖర్చులకిగాను పంచి ఇచ్చేది. ఆరోజు కోసం కృష్ణ ఆత్రుతగా ఎదురుచూసేవాడు. ఆ రోజుల్లో పేపర్లు అమ్మితే అయిదో పదో వచ్చేది. కాని అదే ఎక్కువ డబ్బు. వయస్సు కూడా చిన్నది అవటం చేత అవసరాలు తక్కువ. కమల పెళ్లయి వెళ్లిపోయిన మూడునెలల తరువాత ఓసారి పేపర్లు అమ్మి వచ్చిన డబ్బుని తల్లి పూర్తిగా కొడుక్కి ఇచ్చింది. ఆ విధంగా, కృష్ణ ఆ డబ్బుని పెళ్లయి వెళ్లిపోయిన కమలతో పంచుకోలేదు ఆసారి. అది కమల హక్కుని కోల్పోవటం చేత అని అను కొన్నాడు. ఊళ్లో లేకపోవడం చేత అని అనుకోలేదు.

రెండోసారి అమ్మినప్పుడు కమల ఉంది కదాని తల్లి రెండో విధంగా ఆలోచించి కమలకి వాటా ఇవ్వబో యింది. అప్పుడు కృష్ణ అన్నాడు కదా,

"అక్కకి కావలసిన డబ్బు ఇవ్వటానికి బావ వున్నాడుకదా! పైగా అక్క పెట్లో బోలెడు డబ్బుంది చూశాను," అన్నాడు.

"నా దగ్గరున్న డబ్బు ప్రసక్తి ఎందుకు? ఇందులో నాకు వాటా ఇన్నాళ్లు ఉంది కదా! ఇప్పుడెందుకు లేకుండాపోయింది?" అని కమల ఆశ్చర్యంగా అడిగింది.

కృష్ణ ఠపీమని జవాబు చెప్పాడు.

"ఆడపిల్లకి పెళ్లవగానే అత్తవారింట్లో హక్కులేర్ప డ్తాయి. పుట్టింట్లో పోతాయి. ఏదో ఒక ఇంటి సంపద లోనే వాటా వస్తుంది. అవ్వా బువ్వా ఎల్లా వస్తాయి! పెళ్లయిన మీ ఆడబడుచులకి మీ ఆయన్తో సమానంగా వాటా మీ మావగారిస్తారా? ఇస్తే నువ్వు ఊరు కుంటావా!"

"రెండ్రూపాయలకెన్ని మాటలన్నావురా! రేపు నీ ఇంటికి నన్ను రావద్దంటావురా!" అంది కమల బాధగా.

"అదేమిటక్కా! తర్కిస్తే జవాబు చెప్పానుగాని నీకీ ఇంట్లో ఎప్పుడూ స్థానముంటుంది. పుట్టింట్లో ఆడ పిల్లకి హక్కులూ ఉండవు. అప్పులూ ఉండవు. ముద్దూ ముచ్చటకి ఎప్పుడూ లోటు ఉండదు," అన్నాడు నొచ్చు కుంటూ కృష్ణ. కమల మాట్లాడకూరుకుంది అప్పుడు.

కమలకి పుట్టింట్లో నిజానికి ఎప్పుడూ ఏ లోటూ జరగలేదు. కమలనీనాడు బాధిస్తున్నది తనకి హక్కుగా

ఏదీ రాకపోవడం. అన్నీ బహుమానాలుగానే రావటం. బహుమానాలు అవతలివాళ్లు ఆపేక్షతో పెట్టే భిక్షలు. కమల కృష్ణతో నెమ్మదిగా అంది, కృష్ణకా సంఘటన గుర్తుకు వచ్చినట్లు పోల్చుకొని,

"ఆరోజు నా పెట్టెలో డబ్బు చూశావు, నిజం. అదెంతుందో తెల్సా! తిరిగి వెళ్లటానికి రైలు ఖర్చులకి సరిగ్గా సరిపోయే అంత. మీ బావగారు అంతా లెక్కకట్టి అణాపైసలతో ఇచ్చారు నా చేతికి, నేను ఇబ్బంది పడ కూడదని."

"నువ్వు వెనక్కి వెళ్లడానికి ఎప్పుడూ నాన్నగారు డబ్బిచ్చేవారు కదా! నేనే వచ్చి రైలెక్కించేవాడిని కదా! బావగారిచ్చిన డబ్బు నువ్వు స్వంత ఖర్చులకి వాడుకో వచ్చు కదా!"

"ఆయన రైలుకిచ్చిన డబ్బుని స్వంత ఖర్చులకి నేనెప్పుడూ వాడుకోలేదు. అది వెనక్కిచ్చేదాన్ని. ఒక్కొక్క సారి ఆయన నీ దగ్గరే వుంచి ఇంటి ఖర్చులు పెట్టు అనేవారు. ఎప్పుడైనా నన్నే ఉంచుకోమనేవారు ప్రేమ పొంగుకు వస్తే."

"బావగారు మంచివారని నువ్వూ ఒప్పుకొంటు న్నావు కదా!"

"అది మంచికి నువ్విచ్చే నిర్వచనం మీదుం టుంది. నేను కోరుకొనే స్వేచ్ఛనిబట్టీ ఉంటుంది. ఆయన ఇచ్చింది నేను తీసుకొంటున్నంత కాలం ఏ సమస్యా ఉండదు. నేను నాకింత కావాలని అడిగి, అది ఇవ్వకపోతే సమస్యలు మొదలవుతాయి."

"అన్నీ ఆయన అమరుస్తుంటే నీకు ఇంకా డబ్బెందుకు!" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణ.

"నువ్విక్కడ రెండ్రోజులుండు. నీ జేబులోని డబ్బు నాకివ్వు. నీ అవసరాలు గమనించి నేనే నీకు అన్నీ అమరుస్తాను. ఆ స్వర్గం అనుభవిస్తేగాని అర్థం కాదు."

"నువ్వక్కడ లేని సమయంలో నాకు కాఫీ తాగా లనిపిస్తే?"

"ఆయన లేని సమయంలో నాకనిపిస్తే?"

"ఇంట్లోనే వుంటావు కదా కలుపుకొంటావు!"

"ఇప్పుడు నువ్వూ ఇంట్లోనే కదా ఉండబోతున్నది. కలుపుకుంటావు. ఎంత జాగ్రత్తగా కలుపుకుంటావంటే పాలవాడు పోసిన పాలు అన్ని అవసరాలకి సరిపడేలాగా జాగ్రత్తగా కలుపుకుంటావు. నేను ఆఫీసు నుంచి వచ్చి ఓ కప్పు కాఫీ కోరవచ్చునన్న స్పృహతో కలుపుకొంటావు. పాలు వలకకుండా కలుపుకుంటావు! కొలిచి కలుపు కుంటావు!"

కమల మాటలకి కృష్ణ అప్రతిభుడయ్యాడు.

"అదంతా ఎందుకుగాని పద మనింటికి పోదాం!" అన్నాడు.

"అది మన ఇల్లు కాదురా! అది నీ ఇల్లు. అక్కడ నేను అతిథిని. మీ బావగారింట్లో దాసిని. అది మన ఇల్లు అని నువ్వు అన్నా మీ ఆవిడ ఒప్పుకోదు. నాన్నగారే ఒప్పుకోలేదు, నాన్నగారి విల్లులో నాకు కూడా భాగం ఎందుకు రాయలేదని అడిగిన రోజున," అంది కమల. అందులో కోపం లేదు. సత్యాన్ని వ్యక్తం చేస్తున్న దృఢత్వమే కాని.

కమల తండ్రి స్వయంకృషితో పైకి వచ్చాడు. కూతురికి పద్దెనిమిది సంవత్సరాలు రాగానే పెళ్లి చేశాడు. కొడుక్కి పెద్ద చదువు చెప్పించాడు. మిగిలిన కొద్ది డబ్బులో ఇల్లు కట్టి పింఛన్‌తో బతుకు వెళ్లదీశాడు. కొద్ది సంవత్సరాలకి పోతాడనగా ఆయన విల్లు రాశాడు. అది తన స్వంత దస్తూరితో పూర్తి ఆరోగ్యంతో ఎవరి ప్రోద్బలమూ లేకుండా రాశాడు. అది తను ఆరోగ్యంగా ఉన్నప్పుడు కూతురికి, కొడుక్కి, భార్యకి చదివి వినిపిం చాడు.

కమలకి అప్పటికి పెళ్లయి పాతిక సంవత్స రాలైంది. ప్రపంచం కొద్దిగా బోధపడింది. అందువల్ల కమల ధైర్యంగా తండ్రిని-

"నాన్నగారు మీ స్వార్జితంలో మీ కూతురునైన నాకు వాటా లేదా?" అని అడిగింది.

కమల ప్రశ్నకి తండ్రి ఆశ్చర్యపోయాడు. ఆయన కమల ఆ ప్రశ్న అడుగుతుందని ఊహించలేదు. కానీ జవాబు చెప్పాల్సిన బాధ్యత ఉందని గ్రహించాడు. గ్రహించి,

"చూడు తల్లీ! తమ్ముడికి నీకంటే ఎక్కువ చదువు చెప్పించాను నిజమే! కానీ నీ పెళ్లికి, పురుళ్లకి, పుణ్యాలకి ఖర్చు పెట్టిందేమీ తక్కువకాదు. అందుచేత వాడి చదువుకైన ఖర్చుకి నీమీద అయిన ఖర్చులకి ఒక విధంగా చెల్లు," అని జవాబు చెప్తుండగా కమల-

"నా పెళ్లిలో నా మీద పెట్టిన ఖర్చు నాకర్థమౌ తుంది. నా భర్తకిచ్చిన బహుమానాలు కూడా నా మీద పెట్టిన ఖర్చుగానే లెక్కపెట్టడం అన్యాయం," అంది.

"మీ కుటుంబానికే ఇచ్చాం కదమ్మా! కోడలికి పెట్టిన నగలు తమ్ముడికిచ్చినట్టుకాదా?" అని అడిగాడు తండ్రి.

"తమ్ముడి విషయంలో అది రైటే అనుకొంటాను. మరదలి వస్తువుల మీద తమ్ముడికి ఆచరణలో

అధికారం ఉంది. కానీ నా భర్తకి మీరిచ్చిన వస్తువులపై ఆచరణలో నాకధికారం లేదు. ఆస్తులు, డబ్బు ఎప్పుడూ పురుషుల నుండి పురుషులకి వెళ్తాయి. అంటే మీ నుంచి మీ కొడుక్కీ, మీ అల్లుడికీ వెళ్లగా పేరుకి నాకు వెళ్లినట్టుగా లెక్కవేస్తున్నారు,'' అని జవాబు చెప్పింది కమల. ఆమెకెక్కడో తనూ తన భర్త ఒకటే అని అందరూ భావించడం, భర్తేమో తనూ ఆయన వేరన్నట్టు పాతిక సంవత్సరాలుగా ప్రవర్తిస్తూ రావడం ఎక్కడో అన్యాయం గా అనిపిస్తోందీ మధ్య. ఆమె మాటలకి సమాధానం అక్కడే నిలబడి ఉన్న మరదలు నుంచి వచ్చింది.

"మీ మావగారి ఆస్తిలో మీవారు మీ ఆడబడుచు లకీ వాటా ఇచ్చారా? లేదే! నా అన్నదమ్ములు నాకిచ్చారా! మా తండ్రి ఆస్తిలో నాకు వాటా లేదే! స్త్రీకి భర్త ద్వారా మావగారి ఆస్తిలో వాటా రావడమే పద్ధతి.'' మరదలికి కమల జవాబు చెప్పలేదు. ఆమె తన మావగారు పోయి నప్పుడు తన ఆడబడుచులకి కూడా తన భర్తతో సమా నంగా వాటా రావాలని కానీ రాకూడదని కానీ అనుకో లేదు. ఎంతసేపు అది వాళ్ల కుటుంబ విషయం అను కుంది. తన భర్త, తన ఆడబడుచులు, మరుదులు తననెప్పుడూ పరాయిదానికిందే చూశారు. అందుకని కమలని వాళ్లు అభిప్రాయం అడగనూలేదు, ఆమె చెప్పనూలేదు.

"వదినగారూ! మీరు కోరినదీ ధర్మమే! మీ వాటా ఇక్కడ మీరు తీసుకుని, అక్కడ మీ ఆడబడుచులకి, వాళ్ల వాటా వాళ్లకిప్పించండి,'' అంది మళ్లీ మరదలే.

కమల మరదలు తెలివికి విస్తుపోయింది. తని క్కడ తీసుకోగలిగిన దానికంటే అక్కడ పోగొట్టుకొనేదే ఎక్కువ. ఆ విషయం తెలిసి మరదలు ఆ మాట అంది. ఆరోజున మరదలికి కమల సమాధానం చెప్పలేక పోయింది.

"పైగా నేను, మీ అమ్మ మా శేష జీవితాలు తమ్ముడి దగ్గరే గడుపుతాం కదా! వాడికి వాడి భార్యకి మాకు సేవ చేయక తప్పదు కదా! ఈరోజుల్లో డబ్బు కంటే ప్రియమైంది సర్వీస్. మేము వాడికి కాష్‌లో ఇస్తాం. వాడు నాకు కైండ్‌లో రిపే చేస్తాడు,'' అన్నాడు తండ్రి.

ఆపైన ఆమె అడిగిందనో లేక ముందరే అను కున్నాడోగాని ఆమె తండ్రి ఆమె వెళ్లేలోపల ఓ పదివేల రూపాయలు ఆమె పేరు మీద ఫిక్సెడ్ డిపాజిట్ వేశాడు. ఆ తరువాత ఆయన ఏడాదికి పోయాడు.

కృష్ణకి తండ్రి విల్లు విషయంలో ఆరోజు జరిగిన చర్చంతా గుర్తుకు వచ్చింది.

"అంచేత అది నా ఇల్లు కాని నీ ఇల్లు కాదం టావు. బాగానే ఉంది. పోనీ బావగారి ఇల్లు నీ ఇల్లే కదా! అక్కడే ఉండు. ఇక్కడెందుకు?'' అన్నాడు కృష్ణ.

"అది నా ఇల్లు కూడా అని వచ్చి మీ బావగార్ని అనమను. ఇల్లు తుడవడానికి, ముగ్గులు పెట్టడానికి, తోరణాలు కట్టడానికి, భర్త శ్రేయస్సు కోరి పూజలు, పునస్కారాలు చెయ్యడానికి కాక, నా మాట చెల్లే నా ఇల్లని, నాకిష్టమైతే నావాళ్లు వచ్చిపోయే హక్కులు నాకా ఇంట్లో ఉన్నాయని మీ బావగార్ని చెప్పమను. తక్షణం వెళ్తాను. పోతే నన్ను కన్నతండ్రి కట్టిన ఇల్లు నాది కాదు అన్న విషయం నిర్ద్వంద్వంగా ఆనాడే తేలిపోయింది. అది తిరగతోడవద్దు,'' అంది కమల.

కృష్ణ అక్కడ భోంచేసి, బావగారైన రామారావు దగ్గరకు వెళ్లి తన రాయబారం విఫలమైనదని చెప్పాడు. రామారావు వెంటనే వెళ్లలేదు కమల ఇంటికి. తన భార్య విడిగా ఉండటం గురించి అందరూ అడుగుతుంటే అవమానం అయిపోతోందని ఓ పదిరోజుల తరువాత రామారావు కమల ఇంటికి వెళ్లాడు. వెళ్లి-

"ఇంటికిరా!'' అన్నాడు.

"ఎవరికింటికి?'' అని అడిగింది కమల.

"మనింటికి,'' అన్నాడు రామారావు.

"అది మన ఇల్లు అన్న విషయం మీ నోటంట మొదటిసారి వింటున్నాను,'' అంది కమల.

"ఎప్పుడు కాదన్నాను?''

"లక్షసార్లు,'' కమల ఒక్కొక్క సందర్భం చెప్పుకు వచ్చింది.

రామారావు కమల పుట్టింటి విషయం వచ్చినప్పు డల్లా, 'మీ ఇంట్లో అట్లాగేమోకాని...' అంటూ ఉంటాడు. అట్లాగే కమలను వేరుచేస్తూ, 'మా ఇంట్లో అట్లా కాదు,' అంటూ ఉంటాడు. ఎన్నాళ్లయినా 'మీ' 'మా'లు పోయి మన అన్నమాట ఏర్పడలేదు. ఏదన్నా భేదాభిప్రాయం వ్యక్తం చేస్తే, 'ఇది నా యిల్లు. నా ఇంట్లో నామాటే నెగ్గాలి.' అనేవాడు.

"నా పుట్టింట్లో ఇది నా యిల్లంటారు. మీరు కాదంటారు. మీరేమో నా పుట్టింటి గురించి ఎప్పుడు మాట్లాడినా 'మీ ఇల్లు', 'మీ ఇల్లు' అంటూ ఉంటారు. ఈ రెండింటిలో ఏది నా యిల్లు?'' అని అడిగింది కమల ఓరోజు.

"ఆడవాళ్లకేమిటి? అన్నీ వాళ్ల ఇళ్లే,'' అంటూ రామారావు దాన్ని హాస్యంలోకి దింపి కొట్టి పారేశాడు.

ఎప్పుడైనా కమల అత్తగారు వస్తే ఆవిడ, రామా రావు కలిసి కమలని పరాయిదానిగా చూస్తూ ప్రవర్తించే వారు. వాళ్ల ఆస్తి విషయాలు తలుపులు వేసుకుని కమల వినకూడదన్నట్టు మాట్లాడుకునేవారు. ఆవిడా తనలాంటి కోడలేకదా! ఆవిడ ఎట్లా ఇంట్లోది అయింది? తను ఎట్లా పరాయిదైంది? బహుశ తన కొడుకుకి తను ఇంట్లోది, తన కోడలు పరాయిది అవు తుందేమో! అట్లా కానీకూడదు అనుకొంది కమల. అందుకని ఆమె కొడుకుని కోడలుకు దూరం చెయ్యా లని ప్రయత్నించలేదు, తను దగ్గరవ్వాలనీ ప్రయత్నించ లేదు.

కానీ ఒక్కసారి మాత్రం భర్తతో కూతురి తరపున పోట్లాడింది.

"అది కూడా మీకు పుట్టిందే. మీ సంపాదనలో దానికి భాగం ఉంది. రెండిళ్లలో ఒక యిల్లు దానిపేర్న పెట్టండి," అంటూ.

దానికి కారణం కమల తండ్రి పోయాక కొన్నాళ్లు తల్లిని తన దగ్గర ఉంచుకొందామనుకొంది. భర్త ఒప్పుకోలేదు.

"మీ తమ్ముడిదే బాధ్యత," అన్నాడు.

"బాధ్యతలు వేరు, ఆపేక్షలు వేరు," అంది కమల.

"మా అమ్మ మన బాధ్యత, మీ అమ్మ కాదు," అన్నాడు రామారావు.

"బాధ్యతలు మనవి, అధికారాలు మీవి! బావుంది!"

"ఇది మీ ఇల్లు. ఆవిడ మీ అమ్మ. ఆవిడ మీ బాధ్యత," అది కమల.

"ఇక్కడ నీకే బాధ్యతా లేకపోతే మీ ఇంటికే ఫో ఇక్కడ నువ్వేం ఉండక్కర్లేదు," అన్నాడు రామారావు కోపంగా, పనిచెయ్యని పనిమనిషిని పన్లోంచి మాన్పించే ధోరణిలో.

కమల ఏమీ మాట్లాడలేదు ఆసారికి.

కానీ కూతురు విషయం వచ్చేసరికి తన కూతురు తన అల్లుడి వల్ల అటువంటి అవమానం పొందరాదని, ఆర్థికంగా భర్త మీద ఆధారపడే భార్యని భర్త గౌరవంగా చూడకపోవడానికే ఎక్కువ అవకాశం ఉందని ఆమె నమ్మి కూతురికి కొడుకుతో సమంగా వాటా పెట్టమంది. అప్పుడు కొడుకు పోట్లాడాడు.

కోడలు, "ఇదెక్కడైనా ప్రపంచం మీద ఉందా! ముసలితనంలో మీ ఇద్దర్నీ చూసుకొనేది మేమా? తనా?" అని అడిగింది.

కమల కోడలికేసి జాలిగా చూసింది. ఆపైన నెమ్మదిగా మాట్లాడటం మొదలుపెట్టింది.

"మగవాళ్లు చాలా తెలివైన జాతి. అందుకనే ఇన్ని యుగాలుగా మనమీద పెత్తనం చెలాయిస్తున్నారు. మనని మచ్చిక చేసుకున్నారు. ఇంత గడ్డి పడేస్తే చాకిరీ చేసే యెద్దుకి మనకి పెద్ద తేడా లేదు. కొత్త బానిసని లొంగ తీసుకోడానికి పాత బానిసల్ని వాడటం ఓ టెక్నిక్. ఇంటికి కొత్తగా వచ్చిన కోడల్ని అత్తా ఆడబడుచులూ కలిసి వంచుతారు. తరువాత ఆ ఇంటి కోడలు ఆడ బడుచుల్ని ఆస్తి విషయంలో వంచిస్తుంది. ఇదంతా మగవాడు తన స్వార్థంతో మనచేత చేయిస్తున్నదే. దొంగలూ దొంగలూ ఊళ్లు పంచుకున్నట్టు మగ వాళ్లు ఆస్తులు పంచుకుంటారు. నా భర్త, మరుదులు నా ఆడబడుచులకి వాటా పెట్టని రోజున బాధపడ్డాను. ఈరోజు నా కూతురి కోసం నోరు విప్పాను. నువ్వు అడ్డు పడ్తున్నావు ఇప్పుడు. ఇలా మనం ఒక్కళ్ల కళ్లు మరొకళ్లం పొడుచుకుంటూ ఉంటాం. ఈ ఇంటికి నువ్వూ, నేనూ, నా పుట్టింటికి నా తల్లీ మరదలు, నా అల్లుడింటికి నా కూతురూ ఏ హక్కులు లేని నౌకర్లం. ఎక్కడో నూటికి ఒకటీ అరా అదృష్టవంతురాలు ఉండవచ్చు. లేరనను. కానీ మనలో చాలామందికి అత్తిల్లూ మనది కాదు. పుట్టిల్లూ మనది కాదు."

కానీ కమల ఆరోజు కూడా భర్త ఇంటి నుంచి బయటికి వెళ్లిపోదాం అనుకోలేదు.

లోకం మీద ఉన్నదే కదా అని సర్దుకుంది.

ఒకరోజున కమల తమ్ముడి కుటుంబం ఆ ఊరు వస్తున్నట్టు ఉత్తరం వచ్చింది. కమల కాఫీ డికాక్షన్ తీసి వాళ్లకోసం ఎదురు చూడసాగింది. అప్పుడు రామారావు ఆఫీసు నుంచి వచ్చాడు. కమలకి కాఫీ పొడి విషయం గుర్తుకు వచ్చింది. "కాఫీ పొడి అయిపోయింది. రేపటికి లేదు. తీసుకువచ్చారా?" అని అడిగింది కమల.

"ఇవాళ ఆఫీసుకెళ్తుంటే రేపటిదాకా వస్తుంది అన్నావు కదా! రేపు తేవచ్చునని తీసుకురాలేదు," అన్నాడు రామారావు.

"మీరు ఆఫీసుకు వెళ్లాక మాతమ్ముడి కుటుంబం వస్తున్నట్టు ఉత్తరం వచ్చింది. అందుకని ఉన్న పొడితో డికాక్షన్ వేశాను. వాళ్లు రావల్సిన టైమైంది. వాళ్లు రాగానే ఒకేసారి అందరికీ కాఫీ కలుపుతాను," అంది కమల.

కృష్ణ కుటుంబం అరగంట గడిచినా రాలేదు.

"నాకు కాఫీ ఇయ్యి. చచ్చినట్టు మళ్లీ వెళ్లి కాఫీ పొడి తీసుకురావాలి కదా!" అని ట్రాఫిక్‌లో మళ్లీ డ్రైవ్

చెయ్యాల్సి వచ్చిన విసుగు వ్యక్తపరుస్తూ రామారావు అన్నాడు.

కమల కాఫీ ఇచ్చింది. రామారావు బయటికి వెళ్లి కాఫీపొడి తెచ్చాడు. కృష్ణ కుటుంబం ప్రయాణం మాను కొన్నారు. వాళ్లు రాలేదు.

మర్నాడు ప్రొద్దున్న కమల పాత డికాక్షన్ పారబోసి మళ్లీ తాజాగా డికాక్షన్ తీసింది. కమల, రామారావు కాఫీ రోజుకి కొద్దిసార్లే తాగుతారు. కాని అది తాజాగా స్ట్రాంగ్‌గా ఉండాలి. రామారావు అడగనే అడిగాడు.

"నిన్నటి డికాక్షన్‌తో చేశావా?" అని.

"కాదండీ అది పనిమనిషికిచ్చేశాను," అంది.

"మర్చిపోయి అడిగాను. నువ్వు దానాల్లో కర్ణుడిని, శిబిని మించినదానివి," అన్నాడు రామారావు వెటకా రంగా. అందులో అతను క్రితం రోజు కాఫీపొడికి మళ్లీ బయటికి వెళ్లాల్సి రావటంవల్ల జనించిన కోపం వుంది.

"మీరు మరి తాగరు కదండీ!" అంది కమల.

"నువ్వు తాగొచ్చుగా! రానివాళ్లు మీవాళ్లు కదా! వస్తున్నట్టు రాసినవాళ్లు మానుకుంటే ఆ విషయం తెలియజేయవచ్చు కదా! అయినా వాళ్లు వచ్చారో లేదో చూసుకొని డికాక్షన్ చెయ్యవచ్చు కదా! ఇక్కడ ఎవరూ డబ్బు కుప్పలు పోసుకొని కూర్చోలేదు. సంసారపు బుద్ధులు బొత్తిగా లేవు నీకు. ఒక్క రూపాయి సంపాదిస్తే తెలుస్తుంది. సంపాదన ఎంత కష్టమో!" అంటూ రామా రావు ఉపన్యాసం ఇచ్చాడు.

ఆ మాటలకి కమల చాలా కష్టపెట్టుకుంది ఆ రోజున, ఆ వయస్సులో ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చాక రామా రావు ఇంకోలా సాధించటం మొదలుపెట్టాడు.

'ఉద్యోగస్తురాలివి కదా! పెద్ద ఆఫీసరువి. మొగు డొకడున్నాడనే విషయం గుర్తుండటంలేదు. ఆలస్యంగా వస్తే అడిగేవాడెవడు. అడ్డే వాడెవడు.' కమలకి సమా ధానం చెప్పకుండా ఊరుకోవడం తెలుసు.

రామారావు అక్కగారు వస్తున్నట్టు ఉత్తరం వచ్చిందా తర్వాత. "నాక్కుదరదు, నువ్వు పర్మిషన్ తీసుకుని త్వరగా ఇంటికి వచ్చేయి. మా అక్క వచ్చేసరికి కాస్త ఇంట్లో ఉండు," అని రామారావు ఆఫీసుకి వెళ్తూ కమలతో చెప్పాడు వాళ్ల అక్క వస్తానన్న రోజున. ఆమె వచ్చే రైలు మధ్యాహ్నం మూడింటికి వస్తుంది. ఇంటికి వచ్చేసరికి నాలుగు అవుతుంది.

రామారావు ఆఫీసుకు వెళ్లాక కమల గబగబా తయారై తన ఉద్యోగానికి బయల్దేరింది. బయల్దేర్తూ ఎందుకైనా మంచిదని ఇంటి తాళంచెవి పక్కింట్లో ఇచ్చింది. మధ్యాహ్నం మూడింటికే పర్మిషన్ తీసుకుని ఇంటికి బయల్దేరింది. దార్లో ఆమె ఎక్కిన రిక్షా తిరగబడి కాలుకి బాగా దెబ్బ తగిలింది. రోడ్డు మీద జనం ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఎక్స్‌రే తీసి ఫ్రాక్చర్ అవలేదని నిర్ధారణ చేసి కాలుకి కట్టుకట్టి పంపించారు. అప్పటికి అయిదు దాటింది. ఆమె కొంచెం కంగారు పడినా పక్కింట్లో తాళంచెవి ఇచ్చి వచ్చినందుకు ధైర్యం తెచ్చుకుంది. మరో రిక్షాలో రిక్షావాడి సాయంతో ఎక్కి ఇంటికి వచ్చింది. రిక్షావాడే సాయంచేసి దింపాడు. అతనికి డబ్బులిచ్చి నెమ్మదిగా కమల లోపలికి నడిచింది, కట్టు చీర చాటునుంది. అది రామారావుకి కనిపించలేదు. ఆమె ఇంట్లోకి అడుగు పెట్టుండగా రామారావు, "వస్తున్నావా పెళ్లినడకలు నడుచుకుంటూ నెమ్మదిగా! ఆలస్యంగా వస్తే ఇంటికి వచ్చినవాళ్లే చచ్చి నట్టు అన్నీ చేసుకొంటారని నీ ఉద్దేశం," అన్నాడు.

రామారావు మాటలని పట్టించుకోకుండా, "వదిన గారూ! మీకు పక్కింటావిడ తాళం చెవులివ్వలేదా?" అంటూ వదినగార్ని కమల పలకరించింది. ఆవిడ జవాబు చెప్పలేదు. అప్పుడు-

"దార్లో..." అంటూ తన భర్తకి సంజాయిషీ ఇవ్వ బోయింది.

"స్నేహితులు తగిలారు అంతేగా! రోజూకంటే ముందు రమ్మంటే, ఆలస్యంగా వచ్చావు. నీకు నా మాటంటే లెక్కలేదు. నా మాటంటే లెక్క లేకపోతే నా ఇంట్లో ఉండక్కర్లేదు. వేరే ఇల్లు చూసుకు ఫో! ఇక్కడ నాతో కాపురం చెయ్యదల్చుకుంటే వళ్లు దగ్గర పెట్టుకుని కాపురం చెయ్యి," అని రామారావు కమలని దులి పేశాడు.

రామారావుకి కోపం రావటం కమల అర్థం చేసుకో గలదు. కానీ రామారావు కనీసం ఆలస్యం ఎందుకైంది అని అడుగుతాడనుకొంది. తనకి దెబ్బ తగిలి కట్టు కట్టించుకొని వచ్చిన విషయం తెలుసుకొని అయ్యో పాపం అంటాడనుకుంది. ఆమెకి పుండుకి కారం రాసి నట్టయ్యాయి అతని మాటలు.

ఆ మర్నాటికి రామారావు బుర్రలోకి ఆ క్రితంరోజు కమలకి దెబ్బ తగిలిన సమాచారం ఇంకింది. తప్పు చేసినట్లు అర్థమైంది. కానీ, "హాయిగా ఇంట్లో కూర్చోలేక వీధులట్టుకొని తిరిగితే దెబ్బలూ తగుల్తాయి. మాన భంగాలు జరుగుతాయి," అన్నాడు. రామారావుకి ఆ పరిస్థితుల్లో ఏమనాలో తెలియలేదు. కనీసం ఏమన కూడదో తెలిసి ఉండాల్సింది. దాంతో కమల మనసు

పూర్తిగా విరిగిపోయి ఇల్లు వెతుక్కుని అతనింట్లోంచి బయటపడింది.

కమల భర్త ఇంట్లోంచి బయటికి వచ్చిన నెల రోజులకి తల్లిని ఒప్పించి తీసుకు వెళ్లటానికి కొడుకు నారాయణ వచ్చాడు.

"అమ్మా పోనీ వచ్చి నా దగ్గర ఉండు," అన్నాడు.

"నీ ఇంట్లో ఉంటే నా ఉద్యోగం ఏమవుతుంది? ఉద్యోగం వదులుకొని వచ్చినా నీ ఇంటి పద్ధతి నాకు పడదు. నీది కంపెనీ ఉద్యోగం. నువ్వూ నీ భార్య పార్టీలకి వెళ్తారు. పార్టీలిస్తారు. అవంటే నాకు పడదు. అవి మానమంటే మీరు మానలేరు. నా కోసం మీ పద్ధతులు మార్చుకోలేరు కదా," అంది కమల.

"అమ్మా! నా ఇంట్లో నా భార్యకు గాని, నాకుగాని పూర్తి స్వేచ్ఛ ఉందా? ఏ ఇద్దరు మనుషులు కలిసి ఉండాలన్నా ఇద్దరు కొద్దిగా అయినా సర్దుకోక తప్పదు కదా!" అన్నాడు నారాయణ.

"కావచ్చు. కానీ నువ్వు నీ ఇంట్లో బానిసవు కావు," అంది కమల.

"అమ్మా మగవాడు డబ్బుకి బానిస, ఆడది మగవాడికి బానిస. భార్య భర్తకి బానిస. భర్త మొత్తం కుటుంబానికి బానిస. పూర్తి స్వేచ్ఛ ఎక్కడా ఉండదు. పరిమితుల్ని గుర్తించడమే స్వేచ్ఛ అంటారు," అన్నాడు నారాయణ.

"నాకు పెద్ద విషయాలు అర్థం కావురా నారాయణా! వ్యవస్థ మారితేగాని మారనివి కొన్ని ఉన్నాయి నిజమే! కాని కొన్ని వ్యక్తులు మారటం ద్వారా మారగలిగినవి ఉన్నాయి. అలా వాళ్లు మారితే మరి కొందరి జీవితాలు రవ్వంత సుఖవంతమౌతాయి. మగవాళ్లు మాటల్లో, ప్రవర్తన్లో కొంత అహంకారాన్ని వదులుకుంటే, స్త్రీలకి ఓ మనస్సుందని గుర్తిస్తే చాలు, స్త్రీల జీవితంలో మల్లెలు పూస్తాయి. పూర్వం మనువు 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అన్నది ఈ రోజున 'నస్త్రీ గృహం అర్హతి' అయింది. చిన్నప్పుడు తండ్రి ఇంట్లోను, మధ్య వయస్సులో భర్త ఇంట్లోను, ముసలితనంలో కొడుకు ఇంట్లోను ఉంటూ వారి ఇష్టాలు గమనించుకొంటూ తనకంటూ కొన్ని ఉన్నాయని మర్చిపోయి మనుగడ సాగించాల్సి వస్తోంది. అందరిచేత ఇది నీ ఇల్లు కాదు. ఇది నీది కాదు అనిపించుకొంటూ బతకాల్సి వస్తోంది. నా ఇల్లు ఏది అనేదానికి సమాధానం వెతుక్కుంటున్నాను," అంది కమల.

"ఇది నీ ఇల్లా అమ్మా?" నారాయణ అడిగాడు.

"అవును. ఇక్కడ నా మాట చెల్లుతుంది," అంది కమల.

"ముసలితనంలో ఏం చేస్తావు? అప్పుడైనా నా దగ్గరికి రావా?"

"నీ ముసలితనంలో నువ్వేం చేస్తావు? అదే నేను చేస్తాను. ముసలితనం అనేది ఆడవాళ్లకే కాదు. మగవాళ్లకి కూడా వస్తుంది కదా! మరి మగవాళ్లకి 'ఇది నా ఇల్లు, ఇష్టం ఉంటే ఉండు లేకపోతే పో,' అని భార్యతో గాని, పిల్లల్తో కాని అనగలిగిన ధీమా దేనివల్ల వస్తోంది? అది దేనివల్ల స్త్రీకి లేదు? అంతేకాదు. అటువంటి ఇల్లు ఏర్పాటు చేసుకోవడానికి నేను ప్రయత్నిస్తే అది నిన్నూ, మావయ్యని, నాన్నగార్ని ఎందుకిబ్బంది పెడ్తోంది?"

కమల వేసిన ప్రశ్నకి నారాయణ సమాధానం చెప్పలేకపోయాడు.

'అసలు ఆమె ఇల్లు ఏది?' అన్న ప్రశ్న అతన్ని అతనింటిదాకా వెంటాడింది.

*ఆహ్వానం మాసపత్రిక, మే 1993*